


# నవోదయం

క్యూబా మూలం:
దోరా అలెంగ్జు

ఆమె బిలంలోంచి బయటికి వచ్చింది. ఇది నిత్యం జరిగేదే. ఆమె నివాసం ఉంటున్నది ఓ పాతబండిలో. ఆ పాతబండి నుంచి చక్కెర కార్ఖానా దగ్గరున్న పచారికొట్టు వరకు అమిత వేగంతో పరుగెత్తుకుంటూ వచ్చి ఆ బిలంలోంచి దూరిపోవడం ఆమె అలవాటు.

'ఆమె' అంటే ఒక పెద్ద ఆడ ఎలుక. అడవిపిల్లిలా కనిపించే ఆ కొవ్వెక్కిన ఎలుకకు తీక్షణమైన కళ్లు, కొరడాలా ఉన్న పొడవైన సన్నటి కొనదేరిన తోక....

ఆమె అక్కడే పుట్టింది. ఆమెకు అక్కడి మూలలన్నీ బాగా తెలుసు. అనాసపండ్లు రాసుల దగ్గరికి వెళ్లేదారులు, ఇంటి గడ్డికప్పుని సన్నటి కానరాని మార్గాలు, ఇంటికింద ఎవరికి తెలియని ఎవరూ ఊహించని చీకటి నిండిన మెత్తటి మట్టిరాశిలోని రహస్యమార్గాలు ఆమెకు తెలిసినవే. తన దేహాన్ని వంకరటింకరగా తిప్పగలిగే నైపుణ్యం గల వ్యాయామశాలిలా ప్రతిరాత్రి ఆమె ఆ మట్టిరాశిలోకి జారిపోయి, దానిపైని పలకల నేలకున్న చిన్న సందుగుండా దూరి పచారి కొట్లోకి ప్రవేశించింది.

ఒక్కసారి అందులో ప్రవేశించిందంటే చాలు...సామానులు నింపిన సంచుల వరుసల నడుమగల తన సొంత ఇంటికి వచ్చినంత ధీమా ఆమెకు. అక్కడి రకరకాల చిక్కుడుగింజల పర్వతాకారపు రాశి, వాటి తేమ, పుల్లని వాసన. అక్క డొక పెద్ద సీసా. దానినిండా తెల్లటి పందికొయ్యి పాకం. ఒకసారి దాని అంచుపై పొరాడుతుంటే ఆమె అందులోకి జారిపడడమూ జరిగింది. అయితే, చాలా ప్రయాసతో ఆమె ఎలాగో అందులోంచి బయట పడగలిగింది.

ఆమె అంతటి బలంలోని ఇతర ఎలుకలుమాత్రం అందులోనే ఉండిపోయేవి. మెత్తని కొయ్యిలో టపటప చప్పుడయ్యేలా కొట్టుకుంటూ దొర్లుతూ అందులోని మునిగిపోయేవి. మరుసటి ఉదయం సూర్యోదయ మయ్యాక ఆ మనిషి వచ్చేవాడు. చనిపోయిన ఎలుకల తోకలు పట్టి పీపాలోంచి వాటిని తీసి ఆంగణంలోకి విసిరేసేవాడు. అవి అక్కడ డబ్బుమని పడేవి. కొద్దిసేపటి తరువాత వాటి మృతదేహపు అడుగునుంచి కొవ్వు స్రవించేది. ఆ కొవ్వు చీమల్ని ఆకట్టుకునేవి. ఎన్నో బొద్దింకలుకూడా అదేవిధంగా మరణించేవి.

ఆ రాత్రి ఆమె ఉబ్బిన పొట్టలో గల ఆమె పిల్లలు దొర్లసాగాయి. ఆమె చిక్కుడు గింజల్ని కొరకడానికి ముందే, ఉప్పు పట్టించిన పంది మాంసాన్ని

రుచి చూడడానికి మునుపే అక్కడ రాశి పోసిన ప్రతి వస్తువుపైపు దృష్టి సారించేలోపు తన పొట్ట పగిలిపోతుందేమో అని ఆమెకు అనిపించింది. అప్పుడు ఆమె పిల్లలు ఒకదాని తర్వాత ఒకటి బయటకు రాసాగాయి.

చివర్లో ఉన్న పిండి సంచుల చివర ఆమె గూడు కట్టుకుంది. అక్కడ తన కెవరూ ఇబ్బంది పెట్టరని ఆమె భావించింది.

మరుసటి రోజు ఉదయం తెల్లవారినా ఆమె ఇంకా పచారి కొట్లోనే ఉంది. పగటిపూట ఆమె ఇలా అందులో ఉండడం ఇదే మొదటిసారి. అందువల్ల ఆమె చాలా జాగ్రత్తగా ఉంది. ఆమె గుండె దడగడ లాడుతోంది. మనసు కలవర పడుతోంది.

పచారీకొట్లో అప్పుడే కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. ఉదయపు చప్పుళ్లు అక్కడినుంచి వినిపిస్తున్నాయి. ఇలాంటి ప్రతి ఒక్క సద్దు చెవిన పడ్డప్పుడల్లా ఆమె ఒణికిపోయేది. తన పిల్లల చిట్టిదేహాలపై వాలేది. పక్కన నేలపై పడుతున్న బలమైన అడుగులు ఉరుముల్లా ఆమెను ప్రతిక్షణమూ భయపెట్టేవి.

తలుపు తాళం తెరిచినప్పుడు ఆమె కంగారుగా బెంబేలు పడుతూ, అటూ ఇటూ పరుగులు పెట్టసాగింది. తాను నిర్గమించే మామూలు బిలం దగ్గరికి వచ్చి చేరింది. అయితే, ఈసారి తాను బయటికి వెళ్లలేనని ఆమెకు అనిపించింది. గజగజ వణుకుతూ తన గూడుకు ఆమె తిరిగొచ్చింది. తన సొగసైన మూతిని పైకెత్తి చూసింది. మిలమిలా మెరుస్తున్న ఆమె చిట్టికళ్లు భయంతో చూశాయి. భారమైన, బురద అంటిన బూట్లు ధరించిన పెద్దసైజు పాదాలు రెండు లోపలికి ప్రవేశించాయి.

రాసులు పోసిన గోనెమూటల వెనుకనుంచి బోడిగా ఉన్న రెండు మోచేతులను ఆమె కళ్లు చూశాయి. ఒక చేయి పెద్ద గరిటెను పట్టుకుని ఉంది. పీపాయినుంచి తీసిన కొవ్వు అందులోంచి బొట్లుబొట్లుగా కారుతోంది.

నల్లటి కాగితంపై కొవ్వు మృదువుగా పడింది. అటు తరువాత ఆ చేతులు ఆ కొవ్వును తక్కెడ పళ్లెంలో పెట్టాయి. ఒక వేలు జాగ్రత్తగా దాన్ని జరిపింది.

"నీ కెంత కావాలి?"

"అర పౌండు. నీకు దండం పెడతా... సరిగా కొలిచి ఇవ్వు" అంది స్నేతో.

ఆమె పచ్చటి ముఖం, కళ్లచుట్టూ నలుపు వలయాలు ఉన్న స్త్రీ. చక్కెర కార్ఖానా జనం ముఖాలన్నీ అలాగే ఉంటాయి. ఇది ఆ ఎలుకకు తెలుసు. తూకంలో మోసం జరగడాన్ని పట్టుకోవాలన్నట్టు ఆ స్త్రీ చూపులు తక్కెడమీదే నాటుకుని ఉన్నాయి. తూకం చేస్తున్న ఆ మనిషి ఆమె చూపుల్ని అడ్డుపెట్టలేదు. అందుకు కారణం గిరాకీలను దోపిడీ చేయగల తన యుక్తిని వారు ఊహించడం కూడా అసాధ్యం అని అతనికి తెలుసు. కనురెప్పలనుంచి చూస్తున్న ఎలుకకు ఆమె దీనరూపం కనిపించింది. ఆమె చంకలోని బిడ్డ ఎండిపోయిన ఆమె పాలిండ్లను చీకుతోంది. ఆమె సంకోచంగా తడబడే కంఠంతో మరికొన్ని వస్తువులు కావాలని అడిగింది. ఆ వ్యక్తి వాటిని చిన్న చిన్న పొట్లాలలో కట్టి కౌంటర్ టేబులుమీద పెట్టాడు. తరువాత వరికంకిలా పచ్చగా ఉన్న పెన్సిల్‌ను ఒకచేత్తో ఆడిస్తూ అన్నాడు.

"నీవింకా ఒకటిన్నర పేనో బాకీ ఉన్నావు...రాజోమ్ కోతల కాలానికి నీకు దమ్మిడీకూడా దొరక దనిపిస్తోంది."

ఆమె కిందికి వంగింది. ఆమె భుజాలు ఇంకా కుంగిపోయాయి. ఎండిపోయిన గుండెలమధ్య ఆ పొట్లాలను పెట్టుకుంది. అతను తన నోటు పుస్తకంలో లెక్క రాసుకున్నాడు. చాలా లావైన నోటుబుక్కు అది.

**అనువాదం: రంగనాథ రామచంద్రరావు**

ప్రతిరోజూ ఇలాగే జరిగేది. అవే కంఠాలు వినిపించేవి. అవే ముఖాలు అక్కడ కనిపించేవి. తాము ఇచ్చిన సొమ్ము విలువకు దొరకాల్సిన దానికన్నా తక్కువ తూకాన్నే వారు తీసుకెళ్లేవారు. పందికొవ్వు ఉన్న పీపాల లోపల మరికొన్ని క్రిమికీటకాలు మునిగాయి. వాటి శవాల్ని కెలుకుతూ గరిటె లోపలికి లోలోపలికి దిగేది. నల్లరెక్కల ఆ జీవులను లావు వేళ్లు విదిలించి వేరు చేసేవి. ఒక్క ముక్కనూ వ్యర్థం చేయకుండా ఎంతో జాగ్రత్తగా ఆ చేతులు వ్యాపారం చేసేవి.

సాయంత్రం అంగడికి తాళం వేశాక ఆ పాత ఎలుక కళ్లబడిం దంతా తినేది. దాని పిల్లలూ అలాగే తినేవి. అవికూడా తల్లిలా జాగ్రత్తగా ఉన్నాయి. కొన్నాళ్లకు అవి బలిష్ఠంగా తయారయ్యాయి. చురుగ్గా మారాయి. ఆమె క్రమంగా వాటిపట్ల జాగ్రత్త వహించడం మానేసింది. ఇలాగే అవి కలిసికట్టుగా అంగడి మొత్తం ఎలాంటి భయం లేకుండా సంచరించేవి. తినుబండారాలపై తమ పంటి గుర్తులను, గోళ్ల గీతలను, తమ మృదువైన వెంట్రుకలను వదిలివెళ్లేవి.

చీమలు, నానారకాల పురుగులూ అక్కడ నివసించేవి. ఆ వ్యక్తి వాటిన్నిటిపట్ల ఔదార్యం చూపించేవాడు. సానుభూతితో ప్రవర్తించేవాడు.

ఆ ఎలుక అటు తరువాత చాలాసార్లు పిల్లల్ని కన్నది. రాత్రి అయితే చాలు అక్కడ చాలా గొడవగా ఉంటుంది. నిత్యం జరిగే విందువల్ల ప్రతి వస్తువులోనూ ఎలుకలు, బొద్దింకల వాసన. మూసిన అంగడిలోపల్ల పులిసిన వాసనతో కూడిన వాతావరణంలో రెక్కలు అక్కడినుంచి ఇక్కడికి ఎగిరేవి. మూతులు అక్కడినుంచి ఇక్కడకు జరిగేవి. చీకటి మూలలో అవి ఒకదాని కొకటి ఢీ కొట్టుకునేవి.

ఆ పీపాలో ఉన్న పందికొవ్వు తెల్లటి పాకం నల్లటి చుక్కలతో పదేపదే రంగు కోల్పోయేది. జిడ్డులోకి జారిపోయే ఈ నలుపు శరీరాలు మరుసటి రోజున ఆ కొట్టు ముందరి ఆంగణంలో ఎండ వెలుతురులో చీమలకు రుచికరమైన ఆహారంగా మారిపోయేవి.

ఈ వ్యాపారపు లెక్కపత్రాలను ఖాతాదారు లెవరూ ఉంచేవారు కాదు. ఉన్నలెక్కంతా ఆ పెద్ద పుస్తకంలోనే నిక్షిప్తమై ఉండేది.

అయితే, ఆ పాత ఎలుక పాలిట, ఆ అంగడి మనిషి పాలిట, అలాగే ఆ క్రిమికీటకాల పాలిట ఓ రోజు అన్నీ తలకిందు లయ్యాయి.

అలా కావడానికి కారకులు ఆ మనుషులే. చుట్టూ నలుపు వలయాలు ఉన్న ముఖాలను మోసుకుని పచారీ సామాన్లు కొనడానికి వచ్చే ఆ జనంవల్లే అంతా తలకిందు లయింది. వాళ్లు మూకుమ్మడిగా వచ్చారు. ఐకమత్యంతో అంతా కలిసికట్టుగా వచ్చారు. వాళ్లల్లో మౌనరోషం బుసలు కొడుతోంది. వాళ్ల కళ్లు నిప్పులు రాల్చింది. కుల్లిన ప్రతీ సంచీ, క్రిమికీటకాల ప్రతి గూడూ, ప్రతీ ఎలుక బిలం...ఒక్కసారిగా ప్రాణాంతకమైన భయంతో వణికిపోయాయి. అయితే, అతి స్వల్ప సమయంలోనే అంతా ముగిసిపోయింది. దీర్ఘ బహు దీర్ఘకాలపు బీభత్స ఇతిహాసంనుంచి కలుషితమైన ఆ భయంకరమైన గూళ్లపై తెల్లటి సున్నపు నీటిలో అద్దిన కుంచెలా పగటి వెలుతురు ప్రసరించింది.

ఆ నోటు పుస్తకం వాళ్ల పాదాలకింద నలిగింది. చిరిగిపోయిన దాని పుటలు ఎండకు ఎండిన ఆకులా గాలిలోకి ఎగిరాయి. పురుగులు కొరికిన ఆ గోనెసంచులూ నేల దొర్లాయి. ఆ పీపాకూడా కిందికి దొర్లింది.

చిట్టచివరకు ఆ వ్యక్తికూడా నేల కూలాడు. ●